# నామ, రూపములు వేరుకావచ్చు గాని సచ్చిదానందము ఒక్కటే!

అల్లాయంచు మహమ్మదీయులు జెహోవాయంచు సత్క్రైస్తవుల్
పుల్లాబ్జాక్షు డటంచు వైష్ణవులు శంభుండంచు శైవుల్ సదా
ఉల్లాసంబున గొల్వ నెల్లర నాయుర్భోగ భాగ్యాది సం
పల్లాభంబు లొసంగి బ్రోచు పరమాత్ముండొక్కడే చూడుడీ

భావసంశుద్ధి కల్గుటే భక్తియగును
పుణ్యకార్యాలు చేయుటే పూజలగును
పరులకుపకార మొసగుటే తపసుయగును
మరువబోకు డిటువంటి మంచిమాట

**ప్రేమస్వరూపులారా!**

ప్రపంచములో ప్రతి అణువునందు, జీవితములో ప్రతిక్షణములోను, దేహమునందలి ప్రతి కణమునందు నిరంతరము, సాక్షాత్కరించునది ఆత్మతత్త్వమే! మానవునకు మరొకపేరు మనస్సు. మనసు కలవాడే మానవుడు. మనస్సే లేకున్న మనిషే కాడు. యిట్టి మనసుయొక్క తత్త్వాన్ని గుర్తించటమే మానవుని లక్ష్యము. ఇది జీవునకే ఆసనము. ప్రేమతత్త్వమునకు సింహాసనము. సమస్త కష్టసుఖములకు మనసే కారణము. మనస్సును పవిత్రమైన భావములతో నింపినప్పుడే మనిషి కాగలడు.

**మానవుడు తన దేహములోని సమస్త అంగములు సత్కర్మలలో ప్రవేశపెట్టి జీవితమును సార్థకము చేసుకోవాలి!**

మానవునియొక్క పరమలక్ష్యమేమిటని, గమ్యమేమిటని, పరమార్థమేమిటని ఎవరికి వారు విచారణ సలుపుతూ వుండాలి. ఈ 'మానవ' అనే పదమునందే యితనియొక్క గమ్యము,

sri sathyasai vachanamrutam

లక్ష్యము మరియు పరమావధి యిమిడి వుంటున్నవి. మా - అజ్ఞానము, న-లేకుండా, వ-వర్తించటము. అనగా అజ్ఞానము లేకుండా వర్తించేవాడని 'మానవ' అనే పదముకు అర్థము. అయితే, అజ్ఞానమనగా ఏమిటి? దేహమే నేనని భ్రమించి, దేహమునే వరించి, దేహమునే ప్రధానమైన లక్ష్యమునందు వుంచుకోటమే అజ్ఞానము. దీనికి విరుద్ధమైన మార్గములో దేహిని నేను, దేహితత్త్వమే నాది, దేహియే నాయొక్క గమ్యము అని విశ్వసించటమే జ్ఞానము. దేహి ధరించిన రూపమే దేహము. ఈ దేహము కేవలము వస్త్రము మాత్రమే. వస్త్రము తానుకాదు కదా! ఈ వస్త్రమును ధరించినవాడే తాను. ఈ దేహమే నేనని భ్రమించటముచేత మమత్వము, అహంకారము, ఆడంబరము మొదలగు అవాంఛనీయమైన గుణములను పెంచుకుంటున్నాడు, మానవుడు. అనేక జన్మలనుండి మమత్వము, అహంకారము తనలో గాఢముగా చేరిపోటంచేత మానవుడు తన దివ్యత్వమును గుర్తించుకోలేకపోతున్నాడు. తనయొక్క దివ్యస్వరూపాన్ని తెలుసుకోలేకపోతున్నాడు. కరుడు కట్టుకొని ఉన్న యీ మమత్వమును సులభముగా తొలగించుటకు సాధ్యము కాదు. జపములచేతగాని, తపములచేతగాని, ధ్యానములచేతగాని, భజనలచేతగాని, యింక యే విధమైన కర్మలచేతగాని మాలిన్యము దూరమయ్యేది కాదు. ఆత్మతత్త్వమును మనము సాధించుటకు సాధ్యముకాదు. ఐతే సత్కర్మలాచరించి, సత్ప్రవర్తనలో ప్రవేశించి, సత్య మార్గమును అవలంబించిన, ఇది కొంతవరకు సాధ్యపడుతుంది. తుకారాం "రామా! నేను హీనుడను, దీనుడను" అన్నాడు. దేహములో సర్వాంగములు చక్కగా ఉండినప్పటికి తాను దీనుడను, హీనుడను అనుటలో ఒక అంతరార్థము ఉంది. సేవచేయని యీ అంగములు కేవలము హీనమైనవి. మంచి కార్యములు చేయని యీ అంగములు ఉండి లేనివాటితో సమానము. "నాకు కన్నులున్నవి గాని నిన్ను చూడలేకపోతున్నాను. కనుక, నేను కన్నులుండికూడ గ్రుడ్డివాడనే! చెవులుండి చెవిటివాడనై నీ యొక్క మధుర వాక్కును వినలేకపోతున్నాను. కనుక చెవిటివాడనే! హస్తములున్నవి; కానీ, నీయొక్క సేవలో యివి ప్రవేశపెట్టలేకపోతున్నాను. కనుక, నేను హస్తములుండి కూడను అంగహీనుడనే! నాలుక ఉన్నది, ప్రయోజనమేమిటి? కప్ప నాలుకవలె కదలుతున్నదిగాని నీనామమును నాలుకపై నాట్యమాడించలేకపోతున్నాను. కనుక, నాలుక ఉండికూడను నాలుక లేనివాడనే!" అన్నాడు. మానవుడు తన దేహమందలి సమస్త అంగములుకూడను సత్కర్మలలో ప్రవేశపెట్టి జీవితమును

srisathyasaivachanamrutam

సార్థకము గావించుకోటానికి ప్రయత్నించాలి.

కానీ, మానవత్వములో రెండు విధములైన లక్షణములు ఉంటున్నాయి. తనను తాను మంచిగను, గుణవంతునిగను, తెలివితేటలు కలవానిగను ఊహించుకొని భ్రమించటము. ఎదుటివానియందు మంచి గుణములను, మంచి భావములను, మంచి ఆదర్శమును, తెలివితేటలను అభినందించే సంస్కార లక్షణము రెండవది. ఇట్టివారు లోకములో చాలా అరుదు.

యిట్టి పవిత్రమైన ఆదర్శములను గుర్తించి, తాను అనుభవించి, అన్యులకు అందించి, ఆనందమును పంచుకున్నవాడే, జీసస్. రెండువేల సంవత్సరములకు పూర్వము పాలస్టీన్ అనే రాజ్యములోపల నాజరత్ అనే గ్రామములో మేరీ, జోసెఫ్‌లు జీవించుతూ ఉండేవారు. అది శీతాకాలము. ఆనాటి రోమన్ చక్రవర్తి ఆజ్ఞానుసారంగా ప్రతి పౌరుడుకూడను తన పేరును జనాభా లెక్కలలో చేర్చుకోవాలి. ఈ విధముగా జనాభాలో పేరును చేర్చుకునే నిమిత్తమై అనేక గ్రామములనుంచి ప్రజలు బెతెల్‌హామ్ అనే పట్టణమునకు ప్రయాణమైవెళ్లారు. మేరీ, జోసఫ్‌లుకూడను వెళ్లవలసివచ్చింది. అప్పుడు మేరీకి నవమాసములు నిండాయి. ఆమెకు నడక కష్టముగా ఉంటుందని భావించి జోసఫ్ ఒక గాడిదను యేర్పాటు చేసి దానిపై యీామెను కూర్చోబెట్టి ప్రయాణము సలుపుతూ వచ్చాడు. ఈ బెతల్‌హామ్ పట్టణానికి చేరేటప్పటికి సాయంకాలమైంది. అప్పటికే అనేక గ్రామములనుండి వచ్చిన ప్రజలతో యే సత్రముకూడా ఖాళీలేక, కిటకిటలాడుతుండాది. ఒక సత్రము యజమాని అలసి పోయిన మేరీని చూచాడు. ఒక పశువుల కొట్టములో వారికి వసతి యేర్పరచి ఆరాత్రి అక్కడ ఉండుమని చెప్పాడు. అది 24వ తేదీ డిసెంబరు రాత్రి తెల్లవారితే, 25 వ తేదీ. సరిగ్గా పన్నెండుకు, ఒకటికి మధ్య మేరీ ఒక శిశువును ప్రసవించింది. బిడ్డను ఉంచుటకు సరియైన వస్తువులుగానీ, బట్టలుగానీ లేకపోయినవి, ఆ పశువుల కొట్టము లోపల. పశువులకు తిండిపెట్టే ఒక బుట్టఉన్నది. ఆ బుట్టలో మెత్తని గడ్డివేసి దానిపైన ఒక బట్టను పరచి ఆ బిడ్డను ఉంచింది. ఒకటి రెండు దినముల లోపల యీ జనాభాలెక్కలలో తమ పేర్లు నమోదు చేయించుకుని అక్కడనుండి తిరిగి నాజరత్ గ్రామానికి చేరుకున్నారు.

sri sathyasai vachanamrutam

ఆ పిల్లవాని పేరు జీసస్. మేరీ వానిని చాలా ప్రేమతో పెంచుతూ వచ్చింది. మేరీ గొప్ప భక్తురాలు. చిన్నప్పటినుండి జీసస్‌కు భగవంతుని కథలు చెప్పటము, దయ, ప్రేమ, త్యాగము యిత్యాది సద్గుణములను బోధిస్తూ వచ్చింది. దినదిన ప్రవర్ధమానుడై యీ బాలుడు పెరుగుతూ వచ్చాడు. పన్నెండు సంవత్సరములయ్యేటప్పటికి యూదులకు ఒక ప్రత్యేకమైన పండుగ వచ్చింది. జరూసలెం లోపల గొప్ప ఉత్సవాలు జరుగుతూ వచ్చాయి. దానిని దర్శించే నిమిత్తమై మేరీ, జోసెఫ్ జీసస్‌ని తీసుకొని జరూసెలం పోయారు. వేలాది ప్రజలు చేరి నడచుటకుకూడను వీలుగాని జనముతో కిక్కిరిసి ఉన్నది, జరూసెలం. ఈ వింతలను, వినోదములను పరికించుచూ యీ మేరీ, జోసెఫ్‌లు జీసస్‌ను మరచినారు కొంతసేపు. ఈ లోపల చూసుకుంటే జీసస్ అక్కడ కనుపించలేదు. మేరీ, జోసెఫ్‌లు ప్రతి వీధిలోను ఒక్కొక్క వ్యక్తిని పరికిస్తూ వెతుకుతూ వచ్చారు. చాలా బాధపడ్డారు. బిడ్డ కనుపించక తపించారు. కడపటికి నిరాశ చెంది జరూసెలంలో మందిరములో చూద్దామని లోపలకు వెళ్లారు. అక్కడ ఒక మత గురువు ఉపదేశిస్తున్నాడు. ఆయన ముందు జీసస్ కూర్చొని శ్రద్ధతో వింటున్నాడు. బిడ్డను చూచేటప్పటికి ఆనందముతో బాటు దుఃఖముకూడను కలిగింది, ఆ దంపతులకు. బిడ్డను కరచుకొని 'నాయనా ఎంత కష్టపెడితివి! ఎందుకు చెప్పలేదు? నీకోసమై నేను అనేక విధముల తిరిగి చాలా బాధపడుతున్నాను' అన్నది తల్లి. అప్పుడు జీసస్ 'అమ్మా! ఏమిటి నీ పిచ్చి? నాతండ్రియైన దేవునిదగ్గర నేనుంటే నానిమిత్తమై నీవు భయపడటం ఎందుకు? నాతండ్రి దగ్గర ఉన్నానుగాని, పరాయిచోట లేనుకదా' అని చెప్పాడు. దీనినిబట్టి "తనకు భగవంతుడనే తండ్రి ఉన్నాడు. తాను ఆయన కుమారుడు" అనే విషయము స్పష్టము చేశాడు జీసస్. సరే! ఆఉత్సవము చూచుకుని నాజరత్ గ్రామమునకు తిరిగి వెళ్లారు. అప్పటినుండి జీసస్ తన తండ్రికి కట్టపనిలో కొంత సహాయము చేస్తూ వచ్చాడు. ఈ విధముగా చేస్తూ చేస్తూ మధ్య మధ్య తల్లి బోధనలు వింటూ ముప్పై సంవత్సరముల వయస్సు వచ్చేవరకు పెరిగాడు. తండ్రి మరణించగానే తల్లిని శాంతపరచి అనేక విధములుగా వేదాంతమును ఆమెకు బోధించాడు. తల్లిని ఓదార్చటమే కాక తాను తల్లి దగ్గరనుండి అనుమతిని కోరాడు, "అమ్మా! భగవంతుడు దేహమును యిచ్చినది కేవలము మానవులకు సేవ చేసే నిమిత్తము. దీనులు, దిక్కులేనివారు, పీడితులైన మానవులను రక్షించి వారికి ధైర్య సాహసములను అందించాలి. అట్టి సేవలో పాల్గొనే అనుమతిని తనకు

యివ్వ"మని తల్లిని కోరాడు. తల్లి అనుమతి యివ్వక తప్పలేదు కుమారునికి.

అక్కడనుండి బయలుదేరాడు. జోర్డాన్ నదిలోపల స్నానము చేశాడు. యోహాన్ అనే గురువుదగ్గర చేరి దీక్షను బూనాడు. ఒక దట్టమైన అరణ్యములో ప్రవేశించాడు. నలభై దినములు కఠినమైన దీక్షతో భగవంతుని ప్రార్థించాడు. మూడు విధములైన ప్రార్థనలు తాను సల్పాడు: ఒకటి, సర్వులను ప్రేమించే సమత్వము తనకు ప్రసాదించమన్నాడు. రెండవది, ఎవరేమన్నను, ఎవరు ఎంత బాధించినప్పటికి దానిని సహించి, భరించే శక్తి సామర్థ్యములను అనుగ్రహించమన్నాడు. మూడవది, భగవంతుడు అనుగ్రహించిన దేహాన్ని భగవంతుని నిమిత్తమై అర్పితము గావించుటకు శక్తిని ప్రసాదించమన్నాడు. నలభై దినములు గడచిన తరువాత దీక్షను పూర్తి గావించుకొని భగవంతుడు తనకు ఈ శక్తిని అందించాడనే విశ్వాసముతో బయటకు వచ్చాడు. కోబర్ హేం అనే గ్రామము చేరుకున్నాడు. దానికి సమీపములో ఉన్న ఒక నదీతీరముదగ్గరకు వచ్చేటప్పటికి అనేకమంది బెస్తలంతా నిరాశతో నిస్పృహతో చాలా విచారగ్రస్తులై వుండటం చూచాడు. వారి విచారము, దుఃఖములకు కారణము ఏమిటో తెలుసుకొని దానిని నివారణ గావించటము తన కర్తవ్యముగా గుర్తించుకున్నాడు. "రెండు దినములనుండి మేము ఎంత ప్రయత్నించినప్పటికి ఒక్క చేపైనా మాకు లభించలేదని" ఆ జాలరులంతా జీసస్‌దగ్గర మొరపెట్టుకున్నారు. అందులో ప్రధానమైన బెస్తవాడు పీటరును దగ్గరకు తీసుకుని 'పడవ సిద్ధము చేయి, మనము నదిలో ప్రయాణము చేద్దాము' అని చెప్పాడు, జీసస్. కొంత దూరము వెళ్ళిన తరువాత 'ఈ స్థలములో మీరు వల వేయండి కావలసినన్ని చేపలు మీకు లభిస్తాయి' అని చెప్పాడు. వారు జీవితములో యేనాడు కని, విని, యెరుగనన్ని చేపలు ఆనాడు వారికి లభించాయి. ఆ బెస్తవారు అమితానందముచేత జీసస్‌ను కౌగలించుకొని "మనుషులయొక్క మర్మమే కాదు, చేపలయొక్క నదియొక్క మర్మములనుకూడ గుర్తించుకున్నవాడవు నీవు" అని చెప్పారు. అప్పుడు జీసస్ వారికి చెప్పిన జవాబు "నేను ప్రేమసామ్రాజ్యాన్ని స్థాపించాలని సంకల్పించుకున్నాను. ఇది మా తండ్రియొక్క ఆజ్ఞ. దీనికి మూల స్తంభములుగా మీరు నిల్చాలి" అని చెప్పాడు. ఆనాటినుండి ఆ బెస్తవారలకు అనేక విధములైన వేదాంత బోధలు సలుపుతూ వచ్చాడు, జీసస్.

srisathyasaivechanamrutam

## సంసార సాగరమునందు క్షేమంగా జీవించటానికి భగవత్ప్రేమ ఒక్కటి చాలు

మానవ జీవితము చాలా పవిత్రమైనది, చాలా విలువైనది, కాపాడుకోతగినది. ఇందులోనే మనము భగవంతుని గాంచవలసి ఉన్నది. ఇటువంటి దివ్యమైన మానవత్వమును వ్యర్థము గావించుకోటం సరియైనది కాదని ఆ బెస్తవారలకు బోధిస్తూ వచ్చాడు. ఒక ఉదాహరణము చెప్పాడు. నదిలో చాలా తీవ్రమైన జల ప్రవాహము జరుగుతూ వుంది. ఆ జలములో చిన్న చిన్న చేపలుకూడను పైన తేలుతూ, ఆడుతూ, ఆనందముగా జీవితము గడుపుతూ వుంటాయి. అదే జలములో పెద్ద శరీరము కలిగిన ఏనుగును విడచినప్పుడు ఆ ఏనుగు నీటిలో మునిగి ప్రాణము కోల్పోతుంది. చిన్న ఆకారము కలిగిన చేప యింత వేగముతో వున్న జలములో కూడ ఆడుతూపాడుతూ ఆనందముగా తమ జీవితమును సంరక్షించుకోగలదు. అంత పెద్ద శరీరము కలిగినప్పటికి ఏనుగు మాత్రము ఆ ప్రవాహ జలములోపల ప్రాణమును నిలుపుకోలేకపోయింది. దీనికి కారణం ఏమిటి? జలములో నివసించే జీవులకు యీత అత్యవసరమైనది; ఆకారము కాదు. అదేవిధముగా మానవ జీవితమునకు పాండిత్యముగానీ వేదాంతముగాని, వైరాగ్యముగాని ప్రధానము కాదు. సంసార సాగరములో వుండిన మానవునకు తనను తాను సంరక్షించుకునేందుకు దైవప్రేమ అనే యీత అవసరం. ఏ వేదాంతము తెలియనప్పటికిని భగవత్ప్రేమ ఒక్కటి వుంటే ఈ జగత్తనే సంసార సాగరమందు మనము సుక్షేమముగా జీవించగలము. భగవద్విశ్వాసము లేనివాడు ఎంతటి గొప్ప పండితుడైనప్పటికి, గొప్ప పేరు సంపాయించినప్పటికి, అవన్నీ బాహ్యమైన ఆడంబరములే గాని యిందులో ఆనందాన్ని తాను అనుభవించలేడు.

## దేహిని దర్శించే నిమిత్తమై దేహమును పోషించుకోవాలి

దేహము నీటి బుడగవంటిది. దీనిని ఆధారము చేసుకుని మనము జీవించటము అజ్ఞానమే! దేహిని దర్శించే నిమిత్తమై ఈ దేహమును పోషించుకోవాలి. కనుక, దేహసంరక్షణ అనేది దేహిపైన లక్ష్యము నుంచుకొని చేయాలి. దేహిని మరచి దేహసంరక్షణకు పాటు పడడం పూర్ణ అజ్ఞానమని బోధించాడు. చక్కెర చిన్న కణముగా వుంటుంది. ఆ కణమును ఇసుకలో కలిపినప్పుడు యెంతటి మేధావంతుడైనప్పటికిని దానిని విభజించి యిసుకను, చక్కెరను వేరు

srisathyasaivachanamrutam

చేయలేదు. కానీ, యెట్టి మేధాశక్తి లేకపోయినప్పటికి ఒక చిన్న చీమ ఆ ఇసుకలో ప్రవేశించి యిసుకను చక్కెరనుండి వేరుచేసి చక్కెరను మాత్రమే స్వీకరించి ఆనందముగా అనుభవిస్తుంది. ఈ చీమ చక్కెర రుచి ఎరిగినది కనుక ఆ చక్కెరను స్వీకరించి యిసుకను వేరు చేయగలదు. అటులనే నిత్యా నిత్య విషయ పరిశీలనా శక్తిలేని మానవుడు పవిత్రమైన ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశించలేడు. కనుక, ప్రతి మానవుడు ఏది నిత్యము, ఏది అనిత్యము అనేది గుర్తించటానికి ప్రయత్నించాలి. నిత్యానిత్య విషయ పరిశీలనే మానవునికి భగవంతుడు ప్రసాదించిన ప్రధానమైన gift. అటువంటి పవిత్రమైన శక్తి కలిగికూడను మానవుడు ఈ విచారణలో ప్రవేశించక, భౌతికమునే ఆశించి తన జీవితమును వ్యర్థము చేసుకొనుచున్నాడు.

**ప్రేమ స్వార్థ, స్వప్రయోజనముల నిమిత్తము ఏర్పడినది కాదు**

ఈ దేహము దేహి నిమిత్తమై ఏర్పడినదిగాని కేవలము దేహ నిమిత్తమై ఏర్పడినది కాదు. సత్యమునకు మనము వెరచవలెనుగాని, అసత్యమునకుగాని, అధర్మమునకుగాని ఏమాత్రము వెరచరాదు. సత్యాన్ని మనము పాటించాలి. ధర్మాన్ని మనము ఆచరించాలి. ధైర్యముతో దుఃఖమును ఎదుర్కోవాలి. మన విరోధులనుకూడా మనం ప్రేమించాలి. సర్వధర్మములయందు సమానమైన ప్రేమను బోధించాడు జీసస్. ప్రేమలేక జీవితము లేదు. ప్రేమయే పరమాత్ముడు. ఇట్టి పరమాత్ముడు ప్రేమస్వరూపముతో మన ఎదుట వుండినప్పటికి అట్టి పరమసత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నారు, మానవులు. కేవలము ద్వేషము, అసూయ యిలాంటి దుర్గుణములలోపల ప్రవేశిస్తున్నారు. స్వార్థము, స్వప్రయోజనముల నిమిత్తమై ఏర్పడినది కాదు, ప్రేమ. ప్రేమ ఏ పరమాత్మునినుండి వచ్చినదో ఆ పరమాత్ముని ప్రేమించే నిమిత్తమై ప్రేమను ఉపయోగపెట్టాలి. అంతేకాని, స్వార్థస్వప్రయోజనముల నిమిత్తమై ప్రవేశపెట్టటము మహాదుర్మార్గమనికూడను బోధించాడు, జీసస్. మనకు ఉపకారము చేసినవానికే ఉపకారము చేయటము గొప్పతనము కాదు. అపకారము చేసినవారికికూడను ఉపకారము చేయాలని బోధించాడు.

**ఉపకారికి నుపకారము**
**విపరీతముగాదు చేయ వివరింపంగా**

sri sathyasaivachanamrutam

**అపకారికి నుపకారము**
**నెపమెన్నక చేయువాడె నేర్పరి సుమతీ**

అన్నారు. కనుక, ఎవ్వరిని ద్వేషించటానికి పూనుకోకూడదు. అన్ని గ్రంథములందు, అన్ని మతములందు బోధింపబడిన సమత్వము ఒక్కటే! భగవద్గీతలోకూడను 'అద్వేష్టా సర్వభూతానాం' అని చెప్పబడింది. అందరిని మిత్రులుగా చూచుకోవాలి. శత్రువులయందుకూడను మిత్రత్వము అభివృద్ధి చేసుకోవాలి. ఈ విధమైన బోధ నిత్యము బెస్తవారికి చేస్తూ వచ్చాడు. వాటిని అనుసరిస్తూ, జీసస్‌పైన అమితమైన నమ్మకమును పెంచుకుంటూ, అతన్ని ప్రేమిస్తూ కాలము గడుపుతూ జీవితమును ఆనందముగా గడపుతూ వచ్చారు, జీసస్ ప్రథమ శిష్యులైన ఆ బెస్తవారు.

ఈ విధముగా బెస్తవారలకు అమితమైన చేపలు లభించి ఎక్కువ సంపాదన చేస్తున్నారు అనే విషయమును గుర్తించుకొని tax collector Mathew అక్కడకు వచ్చాడు. ఈ tax collectorను చూచేటప్పటికి బెస్తవారు పరుగెత్తిపోతూ వచ్చారు. జీసస్ వారికి ధైర్యమును బోధించాడు. 'సత్యాన్ని పలికి పన్ను చెల్లించాలిగాని వెరచి మనము పరుగెత్తటము కేవలము బలహీనత', అని వారికి నచ్చచెప్పాడు, జీసస్. Mathew కూడా జీసస్ బోధలనంతా అర్థము చేసుకొని అతనికి నమస్కరించి తానుకూడను ఈ బెస్తవారితో కలిసి ఒక భక్తుడుగా మారిపోయాడు. ఈ విధంగా దినదినమునకు జీసస్‌యొక్క ప్రభావము చాలా పెరుగుతూ వచ్చింది. అన్ని దేశములందు, అన్ని కాలములందుకూడను అసూయాపరులు ఉంటూ వుంటారు. ఆ సమయంలో కొంతమంది పీఠాధిపతులకు జీసస్‌యొక్క పేరు, ప్రతిష్ఠలు మరియు ప్రభావము చూచి అసూయ పెరిగిపోయింది. ఇది అన్ని దేశములందు వుండిన రోగమే! దీనిని ఆధారము చేసుకొని జీసస్‌ను రాజద్రోహిగా చిత్రించి అతనిని హింసించటానికి ప్రయత్నించారు. ఎన్ని విధములుగా హింసించినప్పటికిని అతను సత్యమార్గమును తప్పక, ధర్మమార్గమును వీడక, ప్రేమ మార్గమునందే తన జీవితము అంకితము చేశాడు. తనను భగవంతుడు పంపించిన దూతగా తాను విశ్వసించాడు. I am the messenger of God అనేది బహిరంగముగా తాను తెలుపుతూ వచ్చాడు. 'నేనొక్కడనే కాదు, మీరందరు భగవంతుని మెసెంజర్సు' అని చెప్పాడు.

srisathyasaivachanamrutam

**మానవులందరూ భగవంతుని దూతలుగానే విశ్వసించాలి**

మానవులందరూ భగవంతుని దూతలుగానే విశ్వసించాలి. ఏదో ఒక కారణము లేకుండా కార్యము జరుగదు. ఆ కారణము ఆ సృష్టికర్తకు మాత్రమే తెలుసుగాని యితరులకు అర్థంకాదు. ప్రతి మానవుడు ఆదర్శవంతమైన జీవితమును గడపాలి. ప్రతి మానవుడు తాను భగవంతుని దూతననే విశ్వాసముతో ఈ లోకానికి ఆదర్శమును అందించటానికి ప్రయత్నించాలి. తాను భగవంతుని దూతను అనే విశ్వాసమును అభివృద్ధిపరచుకున్నప్పుడు స్వార్థమును, స్వప్రయోజనమును త్యజించాలి. అప్పుడే తాను ఆదర్శాన్ని అందించటానికి అర్హుడౌతాడు. ఇది అంత సులభము కాదు. అయినప్పటికిని భగవంతుని అనుగ్రహముచేత ఎంతవరకైనా సాధించటానికి వీలవుతుంది. జీసస్ క్రమేణా ఈ భావముతో జీవితాన్ని గడుపుతూ సత్యాన్ని realise చేస్తూ వచ్చాడు. 'నేను కేవలం ఒక మెసెంజరు మాత్రమే కాదు, భగవంతునికి సన్నిహిత సంబంధుడను' అనే భావముచేత I am the son of God అన్నాడు. అనగా దైవత్వమునకు అతి సమీపముగా పోతూ వచ్చాడు.

లోకములో అవతారములు ఐదు విధములుగా వుంటున్నాయి; నిత్యావతారము. అనగా ఒక సామాన్య మానవునిగా నిత్య జీవితములో తన కర్తవ్యమును గుర్తించి, ఆదర్శవంతమైన జీవితాన్ని అందించి, ప్రేమను పెంచి, పదిమందికి పంచేది, నిత్యావతారము. విశేషావతారమని రెండవది. అనగా కేవలము అప్పటికప్పుడు మాత్రమే ప్రత్యక్షమై ఆకార్యమును పూర్తి గావించి ప్రజలను ఆనందపరచి ఆ కష్టమును నివారణ గావించటము యిది విశేషావతారము. అవిశేషావతారమని మూడవది. అనగా భగవదంశములతో కూడి మానవత్వమనే దానిని ఆధారము చేసుకొని పారమార్థిక దృష్టితో ప్రాపంచిక జీవితాన్ని గడపటము. నాల్గవది అంశావతారము. అనగా కొన్ని దైవశక్తులతోకూడి, దైవదృష్టితోకూడి తోటి మానవులకు తగిన ధైర్య, సాహసములను అందించటము. ఐదవది పూర్ణావతారమని. సమస్త శక్తులతోకూడి, సమస్త సృష్టితో చేరి పూర్ణమైన ప్రేమతోమానవత్వమును ఏకత్వము గావించటానికి ప్రయత్నము చేయటము. ఇవే ప్రేమరాజ్యమునకు పునాదులు.

**జీసస్ జగత్తుకు ప్రేమ, కరుణలను బోధిస్తూ వచ్చాడు**

srisathyasaivachanamrutam

క్రమక్రమేణా జీసస్ అంశావతారమని తాను గుర్తించి జీవితమును గడుపుతూ వచ్చాడు. అయితే I and my father are one అన్నాడేగానీ father అనేది వదలలేదు. ద్వైతముతో అనగా I, father అనే రెండు భావములు పెట్టుకుని జీవిస్తూ వచ్చాడు. తనను శిలువకు కొట్టినప్పుడు కట్టకడపటికి తన శ్వాస విడిచేటప్పుడుకూడను చెప్పిన పదము ఒక్కటే Father! Why hast thou forsaken me? అన్నాడు. ప్రాణం విడిచాడు. అనగా అంత్యములో కూడను father అనే భావము తనలో ముద్రింప చేసుకున్నాడు. పూర్ణావతారమునకు, దీనికి వుండిన వ్యత్యాసము ఇదే! జీసస్ జగత్తుకు ప్రేమతత్త్వము, కరుణభావము వెదజల్లుతూ వచ్చాడు. దురదృష్టవశాత్తు, జీసస్ చనిపోయిన 350 సంవత్సరములవరకు అతని పేరు ఎవ్వరూ వుచ్చరించలేదు. అతని విషయములో అనేక విధములైన వాదోపవాదములుకూడను జరుపుతూ వచ్చారు. ఇది కేవలము అజ్ఞానులకుండే పరమ మూర్ఖత్వము మాత్రమే! సత్యాన్ని గుర్తించుకోలేనివారు యిలాంటి అంధకారములో ప్రవేశిస్తూ వుంటారు. ఇలాంటివారు యెన్ని చూపినా, యెన్ని చేసినా, ఏది వారికి అందించినా యథార్థమును అర్థము చేసుకోలేరు.

**నగలు పెట్టిన కోతికి సొగసు రాదు**
**కన్ను విప్పిన అంధుడు కనగ లేడు**
**భక్తి కలుగదు మూర్ఖునకు యుక్తిచేత**

ఈ మూర్ఖులకు భక్తి కలగాలంటే ఏ విధముగా వస్తుంది? అట్టివారు భగవద్విషయమును భక్తితోగాక, యుక్తితో చూస్తారు. యుక్తిచేత భక్తి వారికి ఏమాత్రము చేకూరదు. ప్రేమచేతనే భక్తి, ముక్తి, యుక్తులుకూడను సాధించవచ్చును. భగవంతుని ప్రేమించుము. ఈ ప్రేమ తత్త్వమే మానవునకు రాజమార్గము. అందరియందు దైవత్వముందనే సమత్వాన్ని మనము అర్థము చేసుకోవాలి. ఈ ప్రేమచేతనే ఐకమత్యము సంభవిస్తుంది.

## ప్రేమచేతనే ఐకమత్యము సంభవిస్తుంది

ఒక చిన్న ఉదాహరణము. ఈనాడు యిక్కడ అనేక దేశములవారంతా చేరారు. భాషలో భేదము, సంస్కారములో భేదము, సిద్ధాంతములలో భేదము, వాంఛలలో భేదము. ఎన్ని

sri sathyasai vahini

భేదములు వుండినప్పటికి అన్నిటిని విస్మరించి సాయి ప్రేమతత్త్వమును విశ్వసించి ఒక ఏకత్వముగా ఇక్కడ అన్నదమ్ములు, అక్క చెల్లెండ్రవలె జీవిస్తూ వస్తున్నారు. ఇంతటి ఆనందాన్ని అనుభవించటానికి ఐకమత్యమే కారణముగానీ అన్యము కాదు. ప్రేమలేనిచోట ద్వేషము ప్రారంభమవుతుంది. ప్రేమ నమ్మకముచేతనే ఏర్పడుతుంది. ప్రేమచేత మనకు శాంతి లభిస్తుంది. ఈ శాంతిచేతనే మనము సత్యమార్గములో ప్రవేశిస్తాము. ఈ సత్యమార్గములోనే మనకు ఆనందము లభిస్తుంది. ఆ ఆనందమే దైవస్వరూపముగా మారిపోతుంది. కనుక

where there is confidence, there is love;
where there is love, there is peace;
where there is peace, there is truth;
where there is truth, there is bliss;
where there is bliss, there is God;

కనుక, నమ్మకమును మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈ నమ్మకమే లేకపోతే మానవుడు కేవలము అంధుడుగా మారిపోతాడు. ఈనాడు ప్రపంచములో పిచ్చి పిచ్చి విషయాలపైన నమ్మకము అభివృద్ధి అవుతోంది. కానీ, సత్యముపైన పవిత్రమైన దానిపైన నమ్మకము కుదరటం లేదు. దానికికూడా ఒక ప్రాప్తి వుండాలి.

దైవము అనేక రూపములతో వుంటున్నాడు. దానినే వేదాంత పరిభాషలో 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్' అన్నారు. అనగా సర్వరూపములు భగవంతునివే! భగవంతుని అనేక రూపములలో ఆరాధన చేయటము కేవలము ఆనంద నిమిత్తమే! రోమన్ దేశములోకూడను భారతీయులు విశ్వసించినట్లే అనేక దేవతలనంతా విశ్వసిస్తూ వచ్చారు, పూర్వము. తరువాత క్రిష్టియన్ మతము ప్రారంభమైంది. మొట్టమొదట ఏకత్వమనేది లేదు. అనేకత్వములోనుండి ఏకత్వములోకి ప్రారంభమైంది. మొదట సోక్రటీసు వుండేవాడు. అతని ప్రధాన శిష్యుడుగా ప్లేటో వచ్చాడు. ఈ ప్లేటో శిష్యునిగా అరిస్టాటిల్ బయలుదేరాడు. ఈ అరిస్టాటిల్ శిష్యుడే అలగ్జాండరు. కనుక, యివన్నీ సాంప్రదాయకముగా వచ్చినటువంటివే. కానీ అనేకత్వములో వుండిన దివ్యత్వమును బోధించినవాడు ప్లేటో.

**దేశములు వేరైనా సత్యము ఒక్కటే!**



sri sathyasai vachanamrutam

కనుక, అన్ని దేశములందు సత్యము ఒక్కటే! దేశములు వేర్వేరైనప్పటికి సత్యములు మారటానికి వీలుకాదు. కనుకనే Truth is God. ఆ సత్యాన్ని మనము అనుసరించాలి. ఈ సత్యము మనయందే వుంటున్నది. అదే వేదాంత పరిభాషయందు 'సత్ చిత్ ఆనంద'మన్నారు. ప్రపంచములోని ప్రతి పదార్థము నందు 'ఆస్తి, భాతి, ప్రియం' ఈ మూడూ వుంటున్నవి. పదార్థములు ఎన్ని మారినప్పటికి సత్ వస్తువు అనేది ఒక్కటే. అదే వున్నది. సత్ అనగా being. ఐతే దానికి ఒక విధమైన ప్రకాశాన్ని చేకూరుస్తూ వచ్చినది చిత్. ఇది ఒక టంబ్లరు, ఈ టంబ్లరు వున్నది. ఐతే వున్నదని యేరీతిగా చెప్పగలరు? కనిపిస్తున్నది కాబట్టి వున్నదని చెప్తున్నాము. కనిపింపచేయటమే చిత్. దీనిని ఆనందముగా అనుభవించటమే ఆనందము. ఈనాడిది ఒక సిల్వర్ టంబ్లరుగా వుండవచ్చును. మనము దీనిని చెదరగొట్టి ప్లేటుగా తయారుచేసుకోవచ్చు. టంబ్లరు మారిందిగాని, వెండి మారలేదు. ఆ ప్లేటు మరికొంత కాలమునకు స్పూనుగా మార్చుకొనవచ్చును. ప్లేటు రూపము మారింది గాని, వెండి మారలేదు. టంబ్లరునందు, ప్లేటునందు, స్పూనునందు ఆకారములో మార్పువచ్చినదిగాని పదార్థముయొక్క తత్వము ఒక్కటిగానే వుంటుంది. అదేవిధముగా మానవత్వములో వున్న రూపనామములు మారవచ్చునుగానీ సత్ చిత్ ఆనందము మారేదికాదు. అది శాశ్వతమైనది.

ప్రేమస్వరూపులారా! మానవజాతియందు మనిషికి, మనషికి మధ్యనున్న భేదమనే గోడను మనము కొట్టివెయ్యాలి. ఈ దట్టమైన కులమతములనే screenను దూరము చెయ్యాలి. అందరూ ఒక్కటే అనే ఏకత్వమును విశ్వసించాలి. ప్రేమతత్వాన్ని మనము పెంచాలి. అప్పుడే దేశమంతాకూడను ఒక్కటిగానూ ఆనందముగానూ కళకళలాడుతుంది. చూడండి ఎన్నో సంవత్సరములనుండి బెతెల్‌హామ్‌లోపల జీసస్ పుట్టినరోజును Chrstimas (Xmas) పండుగగా చాలా వైభవముగా జరుపుకుంటూ వచ్చారు. జీసస్ పుట్టిన స్థానమది. మానవునిలో వున్న దుర్గుణములు, దురాలోచనలు, స్వార్థము, స్వప్రయోజనములచేత ఈనాడు బెతల్‌హామ్‌లో Xmas జరుపుకోకుండా నిలిపివేశారు. ప్రపంచమంతా జరుగుతున్నాది గానీ బెతల్‌హామ్ లోపల ఈనాడు Xmas పండుగ జరుపబడడం లేదు. దీనికి కారణము ఏమిటి? మానవునిలో వుండిన స్వార్థమనే దుర్గుణమే. భగవంతుడు అందరియందు వున్నాడు. ఆయన అందరివాడు. కేవలము వ్యక్తి స్వరూపుడు కాదు. సమిష్టి స్వరూపుడు. ఇలాంటి ఏకత్వమును భావించటమే,

sri sathyasai vahini

దైవత్వము అనే పదమునకు అర్థము. ఈనాడు మన దేశములోపల ఐకమత్యమును పెంచాలి.

**అందరు భగవంతుని బిడ్డలనే భావమును పెంచుకోవాలి**

ఐకమత్యమే మానవుని ప్రధాన లక్ష్యము. ఐకమత్యమే వుండినప్పుడు ఈ భేదములు అడుగంటిపోతాయి. భేదములు అడుగంటిపోయినప్పుడే ఆనందము ఆవిర్భవిస్తుంది. ఆనందమే మన జీవిత గమ్యము. కనుక, మీ అందరుకూడను వ్యక్తిగత భేదములకుగాని, ప్రాంతీయ భేదములకుగాని, దేశ భేదములకుగాని అవకాశము యివ్వక అందరు దైవముయొక్క బిడ్డలమనే భావాన్ని పెంచుకోవాలి. ఏ రూపాన్నైనా పూజించండికాని అంతా ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించండి. ఇలాంటి ప్రేమతత్త్వాన్ని పెంచుకోటమే పర్వదినములయొక్క అంతరార్థము. జీసస్ పుట్టిన దినమునాడు కేవలము తినటము, త్రాగటము, ఆడుకోటం, పాడుకోటం యిది మాత్రమే కాదు, జీసస్ ఆదర్శముగా నిరూపించిన విషయములను మనము ఆచరణలో పెట్టాలి. అదే నిజమైన Birthdayకి గుర్తు. అతని పుట్టిన పండుగ చేసుకోటము, అతని ఆదర్శములను పూడ్చి పెట్టటము. యిది భక్తుల సరైన లక్షణము కాదు. ఎవరిని మనము విశ్వసించినామో ఆ విశ్వసించిన వ్యక్తియొక్క ఆదర్శములను ఆచరించటానికి ప్రయత్నించాలి. చెప్పిన మాటను ఆచరించకుండా భక్తి భక్తి అంటే ఏమి భక్తి యిది? కేవలము బూటకపు భక్తి. దీనిని భక్తి అని చెప్పటానికి వీలుకాదు. ఇది స్వార్థపరమైన దుర్గుణమనే చెప్పవచ్చు. అన్నీ చేయకపోయినా, ఏ ఒకటి రెండైనా ఆచరణలో పెట్టాలి. నేను రామ భక్తుడను, నేను కృష్ణ భక్తుడను, నేను సాయి భక్తుడను, నేను జీసస్ భక్తుడను అని చెప్పుకోటం సులభమే! కానీ, చెప్పేదానికంటె ఆచరించి చూపడానికి ప్రయత్నించాలి. అట్టివాడే నిజమైన భక్తుడు. ఆచరణ లేకుండా కేవలము వాక్కుతో వుచ్చరించినంతమాత్రమున ఆనందము లభించదు.

**పుట్టపై మర్దించిన పాము మరణ మొందునా**
**తనువును తా దండించిన విషయ భోగమడగునా**
**ఆకలిదప్పులు వీడినంత ఆత్మజ్ఞాని తానగునా**
**తానెవరో తెలియకున్న తత్వజ్ఞాన మెట్లుకుదురు?**

అన్నారు. Who am I అనే సత్యాన్ని గుర్తించటానికి మనము ప్రయత్నించాలి. నిరంతరము



sri sathyasai vachanamrutam

Who are you, Who are you అని ప్రశ్న వేస్తున్నామే గాని who am I అని ప్రశ్నించుకోటం మరచిపోతున్నాడు, మానవుడు. తనను తాను తెలుసుకోకుండా ఎవరెవరినో తెలుసుకుంటే వచ్చిన ఫలితమేమిటి? తనను తాను తెలుసుకున్నవాడు సర్వము తెలుసుకున్నవాడౌతాడు. తాను ప్రేమస్వరూపుడే! కనుక, సర్వులు ప్రేమస్వరూపులుగానే విశ్వసించవచ్చు. ప్రేమతో భగవంతుని స్మరించండి. ప్రేమతో భగవంతుని భజించండి. ప్రేమతో భగవంతుని వరించండి. ప్రేమతో జీవితమును తరింపజేసుకోండి!

**(తేదీ. 25-12-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam